ప్రజాశక్తి

బుధవారం 04 జూన్ 2025 5 కర్నూలు

యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, జెసి, ఎమ్మెల్యేలు

హామీలు గాలికి..



ఏడాదైనా అమలుకు నోచని వైనం

మాటల్లోనే కూటమి వాగ్దానాలు

జిల్లా ప్రాజెక్టులకు దక్కని నిధులు

ముందుకు కదలని నీటి పథకాలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గతేడాది ఇదే రోజున వెలువడిన ఎన్నికల ఫలితాల్లో టిడిపి కూటమి ఘన విజయం సాధించి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు, 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా రెండు ఎంపీ స్థానాలను, 12 అసెంబ్లీ స్థానాలను కూటమి కైవశం చేసుకుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురికి మంత్రి పదవులు వరించాయి. ఎన్నికలకు ముందు టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జిల్లా వాసులకు పలు హామీలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా హామీలు అమలు కాలేదు. జిల్లా ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదు. ప్రాజెక్టులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు...

గతి లేని గుండ్రేవుల

కర్నూలు, కడప జిల్లాలకు మేలు కలిగిలే రూపొందించిన గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన చర్యలేవీ ఇప్పటి వరకూ మొదలు కాలేదు. గుండ్రేవుల జలాశయం నిర్మాణం జరిగితే 20 టిఎంసిలు నిల్వ చేయనున్నారు. వరద లేని సమయంలోనూ ఈ నీటిని వాడుకోవచ్చు. 2013 నవంబర్ 1న అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం జీవో 100 జారీ చేసి సర్వే కోసం రూ.51.95 లక్షలు మంజూరు చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు సంస్థ సర్వే చేసి రూ.2,890 కోట్లతో సమగ్ర నివేదిక ప్రభుత్వానికి పంపింది. ఆ తరువాత టిడిపి ప్రభుత్వం పరిపాలనా ఆమోదం ఇచ్చింది. ఎన్నికలకు ముందు చంద్రబాబు గుండ్రేవుల చేపడతామని చెప్పినా ఇప్పటి వరకూ అడుగులు పడలేదు.

ఉత్తిపోతలుగానే వేదవతి ఎత్తిపోతలు

కరవుకు నిలయమైన ఆలూరు ప్రాంతంలో పొలాలు పచ్చబడాలన్న ఉద్దేశంతో వేదవతి నది పరిధిలో నిర్మించిన ఎత్తిపోతలు ఉత్తిపోతలుగా మారాయి. వేదవతి నది పరిధిలో అమృతాపురం, జె.హొసళ్లి , సిద్ధాపురం వద్ద మూడు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 2008లో మంత్రి మారెప్ప హయాంలో వీటిని చేపట్టారు. నిర్వహణలో లోపాలు అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పథకాలు ఏడాదికే నిరుపయోగంగా మారాయి. పథకం ప్రారంభంలో వేసిన గొట్టాలు దెబ్బతిన్నాయి. ఒక్కో ఎత్తిపోతల కింద 500 నుంచి 600 ఎకరాల ఆయకట్టు ఉంది.

ప్రారంభానికే టమోటా ప్రాసెసింగ్ యూనిట్

గతంలో పలు సార్లు చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లాలోని పత్తికొండ ప్రాంతంలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామన్న హామీ శంకుస్థాపనకే పరిమితమైంది. గత ప్రభుత్వంలో పత్తికొండ శివార్లలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ కోసం మూడెకరాల స్థలాన్ని కేటాయించారు. ఆ ప్రాంతంలో అధికారులు భూమి పూజ కూడా చేశారు. యూనిట్ నెలకొల్పేందుకు రూ.12.5 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. పునాది దశలో పిల్లర్లు వేసి ఆపేశారు. తరువాత కూటమి ప్రభుత్వం ఆ ప్రాసెసింగ్ యూనిట్‌ను కనకదిన్నెకు మార్చింది. మంత్రి టీజీ భరత్ శంకుస్థాపన చేశారు.

దిష్టిబొమ్మల్లా టిడ్కో గృహాలు

పేదలకు ఇళ్ల కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో గతంలో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేప్పట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. లబ్ధిదారులకు టిడ్కో గృహాలు ఇస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేరలేదు. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు నగరంలోని జగన్నాథగట్టుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కర్నూలు నగరంలోని జగన్నాథగట్టు వద్ద 10 వేల గృహాల నిర్మాణం చేపట్టారు. ఆదోనిలోని సిరిగుప్ప రోడ్డులో 4704 గృహాలను నిర్మించారు. ఎమ్మిగనూరులో శివన్న నగర్‌లో 2240, మైనార్టీ కాలనీలో 1024 ఇళ్లు ఉన్నాయి. నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ, డోన్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నంద్యాలలోని నందమూరి నగర్‌లో 3,904 ఇళ్లు, అయ్యలూరి మెట్ట దగ్గర 2,272 ఇళ్లు, ఎస్ఆర్‌బిసి కాలనీలో 3,824 ఇళ్లను నిర్మించారు. ఆళ్లగడ్డలో చింతకుంట గ్రామ శివార్లలో 1,296 ఇళ్లు, డోన్‌లో హైవే సమీపంలో 306 ఇళ్లను కట్టించారు. ఎక్కడా కూడా లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ ఇళ్లకు విద్యుత్, మంచినీటి సైకర్యం, రోడ్లు, డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేయలేదు. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

సూపర్ సిక్స్ గాలికి

ఎన్నికలకు ముందు టిడిపి సూపర్ సిక్స్ పేరుతో ప్రకటించిన పథకాలు గాలికి వదిలేశారు. ఏడాదికి మూడు సిలిండర్ల పథకం కింద గతేడాది ఒక సిలిండర్‌కు మాత్రమే డబ్బులు జమ చేశారు. ఈ ఆర్థిక సంవత్సంలో ఇప్పటి వరకూ ఒక్క దానికి కూడా జమ చేయలేదు. రైతులకు రూ.20వేల పెట్టుబడి సాయం, విద్యార్థుల తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం అమలు వాయిదా వేస్తూనే వస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇప్పటికీ అమల్లోకి రాలేదు. నిరుద్యోగులకు రూ.3వేల నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు నెలకు రూ.1500 హామీలు ఊసు లేకుండా పోయాయి.

రాజోలికి పడని అడుగులు

చాగలమర్రి మండలంలో రాజోలి వద్ద నిర్మించనున్న రిజర్వాయర్‌కు అడుగులు పడలేదు. ప్రతి ఏటా కుందూ నది నుంచి వచ్చే వరద నీరు సోమశిలకు చేరి, ఆ తరువాత సముద్రంలో కలిసి వృథా అవుతోంది . దీంతో రాజోలి వద్ద 2.95 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించాలన్న ప్రతిపాదన ఉంది. 2008 డిసెంబరు 24న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశే ఖర్ రెడ్డి రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆ తరువాతి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో నీటి వృథా కొనసాగుతోంది. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాకా 2.95 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి జీవో ఇచ్చారు. రూ .1,357.10 కోట్లతో చేపట్టే పనులకు జ్యుడీషియల్ ప్రివ్యూ ఆమోదం లభించింది. ఈ పనులకు జలవనరుల శాఖ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కూడా శంకుస్థాపన చేశారు. అయినా ఇప్పటి వరకూ పనులు ప్రారంభం కాలేదు.

హామీల అమలులో విఫలం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి వైఫల్యం చెందింది. అధికారం చేపట్టి ఏడాది పూర్తి అయిన ఒక పింఛన్ ఇవ్వడం తప్ప సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదు. పి4 పథకం అంటూ ప్రజలను మభ్యపెడుతున్నది. సంక్షేమ పథకాలు అమలు పరచకపోగా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు అంటూ ప్రజలపై భారాలు మోపింది. కరెంటు చార్జీలు రకరకాల పేర్లతో వచ్చిన వాడిన బిల్లు కంటే అదనపు చార్జీలు రెండు రెట్లుగా వసూలు చేస్తున్నారు. ఇంటి పన్నులు పెంచుతున్నారు. ప్రతి పేద కుటుంబానికి పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు స్థలము, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్ల స్థలమంటూ చెప్పినా ఇప్పటివరకు ఎక్కడా స్థలాలు ఇచ్చినట్లు పాపాన పోలేదు. ఉన్న టిడ్కో గృహాలు కూడా లబ్ధిదారులకు ఇవ్వలేదు. జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టేందుకు కనీస చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

- డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

రేషన్ పంపిణీలో ప్రథమ స్థానం : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రేషన్ సరుకుల పంపిణీలో రాష్ట్రంలో కర్నూలు జిల్లా ప్రథమ స్థానం లో ఉందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు.. మంగళవారం జిల్లా కలెక్టర్ పౌరసరఫరాలు , రెవెన్యూ శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ రెండవ తేదీ నాటికి ఎఫ్‌పి షాపుల ద్వారా 2,42,975 మంది కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేసి రాష్ట్రంలో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేశామని కలెక్టర్ తెలిపారు. గతంతో పోలిస్తే ఈ నెలలో రెట్టింపు కార్డుదారులకు ఎఫ్‌పి షాపుల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ జరిగిందని తెలిపారు. వద్ధులు వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేసేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేషన్ పంపిణీ పక్కాగా జరిగేలా పరిరక్షణ చేయాలని సూచించారు.

రాక్ గార్డెన్స్‌లో యోగాంధ్ర

- యోగాసనాలు వేసిన కలెక్టర్, జెసి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్లు మండల కేంద్రంలోని పర్యాటక ప్రాంతమైన రాక్ గార్డెన్స్‌లో బుధవారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట రమణయ్య, పర్యాటక శాఖ అధికారి విజయ, సెట్కూర్ సిఇఒ కె. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షకులు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ , ఎమ్మెల్యేలు యోగ ఆసనాలు వేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జూన్ 21న నిర్వహిస్తున్న ప్రపంచ యోగా దినోత్సవంలో కర్నూలు జిల్లాలో 10 లక్షల మంది పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. యోగాంధ్రలో భాగంగా ఇప్పటికే మాస్టర్ ట్రైనర్లు, ట్రైనర్‌లకు శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యా యన్నారు. ప్రస్తుతం గ్రామ స్థాయిలో పోటీ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.. ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ .. ప్రతి రోజు కొంత సమయాన్ని యోగాకు కేటాయించడం ద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. రాష్ట్ర యోగా సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్, యోగా గురువులు మునిస్వామి, విజయ్‌కుమార్ ఆధ్వర్యం లో యోగా ప్రోటోకాల్ ప్రకారం దాదాపు గంట సేపు యోగాసనాలు వేయించారు. కార్య క్రమంలో టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ ముంతాజ్ బేగం, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, ఓర్వకల్లు పొదుపు ఐక్య సంఘం గౌరవాధ్యక్షులు విజయ భారతి, ఒఎంపిడిఒ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యా సాగర్, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మండల సీనియర్ నాయకులు సిఎస్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు విడుదల చేయాలి

- ఎపి వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు సంబంధించిన రూ.100 కోట్ల బకాయిలు విడుదల చేయండని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కె. లింగన్న డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్యను ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ తరఫున వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలకు మార్చి నుండి మూడు నెలలలో 40 లక్షల పనిదినాల బకాయిలు దాదాపు 100 కోట్లు ఉన్నాయన్నారు. గత మూడు నెలలుగా పని చేసిన కూలీలకు వేతనాలు చెల్లించాలన్నారు. పనిచేసిన వారం లోగా వేతనాలు ఇవ్వాలని చట్టంలో ఉన్నా నెలల తరబడి వేతనాలు ఇవ్వక పోతే పేదలు ఏమి తిని బతకాలో ఒక సారి ఆలోచించాలన్నారు. యోగా యాప్‌లో రిజిస్టర్ చేయండని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఆకలి వేస్తే యోగా చేస్తే తగ్గిపోతుందా అని ప్రశ్నించారు. ప్రభుత్వం తక్షణం వేతనాలు చెల్లించాలని డిమాండు చేశారు. ఉపాధి హామీ కూలీలకు పని ముట్లు అందించాలన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వొకేషనల్ కళాశాలను డివిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్

కర్నూలు నగరంలోని బి- క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా వృత్తివిద్యాధికారి సి.సురేష్ బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కళాశాల అడ్మిషన్ల సంఖ్య పెంచాలని , సమయ పాలన పాటిస్తూ, వార్షిక ప్రణాళిక ప్రకారం విద్యా బోధన చేయాలని సూచించారు. విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా దీవెన పథకంలో భాగంగా ప్రభుత్వం ఉచితంగా సప్లయి చేసిన వొకేషనల్ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశామని, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగ స్వామి నాయక్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్స్ ప్రసన్న కుమార్, రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, సుజాత, పార్థసారథి పటేల్, సుజాత, గిరిజారాణి, శ్రావణి, బాల శంకర్, శ్రీధర్ విద్యార్థులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం

- సిపిఎం పత్తికొండ కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి- మద్దికేర

ప్రజలపై అదనపు భారాలుగా ఉన్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి అన్నారు. ఆయన మద్దికెరలో విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను పగలకొట్టాలని పిలుపునిచ్చిన టిడిపి నాయకులు, నేడు అదే స్మార్ట్ మీటర్ల ద్వారా సామాన్య ప్రజానీకంపై అదనపు చార్జీలు వేసి, భారాలు వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వ్యాపార సంస్థల వినియోగదారులు, సామాన్య, మధ్యతరగతి, రైతులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందాలలో భాగంగా విద్యుత్ చట్ట సంస్కరణలను తెచ్చి, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజల నెత్తిన ట్రూ అప్ ఛార్జీలు వేయటాన్ని సిపిఎం వ్యతిరేకిస్తుందని చెప్పారు. విద్యుత్తు వినియోగ సమయాన్నిబట్టి చార్జీలు వసూలు చేస్తారని, దీన్ని ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

నన్నూరులో తాగునీటి సమస్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నన్నూరు గ్రామంలోని 11, 12వ వార్డుల్లో పర్యటించి తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని సిపిఎం గ్రామ నాయకులు ఎస్.మధుసూదన్ డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో స్థానిక ప్రజలతో ఖాళీ బిందెలతో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మధుసూదన్ మాట్లాడుతూ నన్నూరు గ్రామంలోని 11,12 వార్డులో తాగడానికి నీళ్లు లేక స్థానికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పనులు వదులుకొని పొలాలలో ఉండే బోర్ల వద్ద తాగునీటిని తీసుకువస్తున్నారన్నారు. గత రెండు నెలలుగా తాగు నీటి సమస్య గ్రామంలో తీవ్రంగా నెలకొన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే గ్రామంలో ప్రజలకు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంగలి రామకృష్ణ, ఈశ్వరమ్మ లాల్‌బి, జరీనాబి, పార్వతమ్మ, లక్ష్మీదేవి, మౌనమ్మ, యోగి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

- డిఎంహెచ్ఒ శాంతి కళ

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్ : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ సూచించారు. కర్నూలు నగరంలోని ఎర్రబురుజు యుపిహెచ్‌పిలో నిర్వహించిన ఆశా సమీక్షా సమావేశంలో డిఎంహెచ్ఒ డాక్టర్ శాంతికళ పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ఆశాడేకు సంబందించిన ఎజెండా అంశాలలో భాగంగా, ఆశా యాప్‌లో అర్హులైన దంపతుల సేవలు , ఐరన్ మాత్రల పంపిణీ , విటమిన్ ఎ ద్రావణ పంపిణీ , నవజాత శిశు సేవల వివరాలను క్రమం తప్పక అప్లోడ్ చేయాలని అన్నారు. సీజీనల్ వ్యాదులైన మలేరియా, డెంగ్యూ , డయేరియా మొదలైన వాటి గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. గర్భవతులకు 4వ నెల నుండి ప్రసవానతరం బిడ్డకు ఒక సంవత్సరం వయస్సు వచ్చే వరకు మాతా శిశు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కొరకు 01244451660 నెంబర్ నుండి వచ్చు కిల్కారి మేసేజ్‌ల గురించి అవగాహన కల్పించాలని అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఉచిత ఆరోగ్య సేవలపై ప్రజలకు అవగాహన కల్పించి, వారు ఒపి సేవలకోసం వచ్చేపడ్రు ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్ తీసుకొని వచ్చేటట్లు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సిడి-3.0) పై సర్వే త్వరితంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో డిపిఎంఒ డాక్టర్ ఉమా , డెమో శ్రీనివాసులు శెట్టి, డిపిఒ విజయరాజు, వైద్యాదికారి డాక్టర్. తేజశ్రీ , డిప్యూటీ డెమో చంద్రసేకర రెడ్డి , ఆరోగ్య విద్యా భోదకురాలు పద్మావతి , ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జెఇఇ అడ్వాన్స్‌లో ఆల్ఇండియా ర్యాంకుల పేరుతో మోసం

- నారాయణ, శ్రీ చైతన్య కాలేజీలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అక్షరాలతో లక్షల వ్యాపారం చేస్తూ డబ్బే ధ్యేయంగా విద్యాసంస్థలు నడుపుతున్న నారాయణ, శ్రీ చైతన్య యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో విద్యను ఒక వ్యాపారంగా చేసుకుని పని చేస్తున్న శ్రీచైతన్య, నారాయణ యాజమాన్యాలు నిన్న జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ (జెఇఇ) తమ కాలేజీల్లో కోచింగ్ తీసుకున్న విద్యార్థులకే ఆల్ ఇండియా వ్యాప్తంగా మొదటి 50 ర్యాంకుల్లో మావే వచ్చాయంటూ ప్రచారం చేసుకుంటున్నారన్నారు. పెద్ద ఎత్తున ఈరోజు పత్రిక ప్రకటనలుగుప్పించారన్నారు. అందులో గమనించినట్లయితే చాలావరకు ఒకే విద్యార్థి రెండు కాలేజీల్లో చదివినట్లు, అబ్బాయికి వచ్చినట్లు ఈరోజు పత్రికా ప్రకటన రావడం చూస్తుంటే పేద మధ్యతరగతి విద్యార్థులు తల్లిదండ్రులను ఏ విధంగా ఈ కాలేజ్ యాజమాన్యాలు మోసం చేస్తున్నాయో కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుందని అన్నారు. ఇంతలా విద్య వ్యాపారం చేసుకొని పనిచేస్తున్న అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరించడం చాలా బాధాకరమన్నారు. ఒకవైపు విద్యార్థుల జీవితాల గురించి ఆలోచిస్తున్న తల్లిదండ్రులు ఇలా పేపర్లు ప్రకటనలు వచ్చినటువంటి వాటిని చూసి నిజం అనుకొని వారి పిల్లలను ఈ కాలేజీల్లో చేర్పిస్తున్నారన్నారు. మొదటిగా అడ్మిషన్ జాయిన్ అయ్యే టైంలోనే సీటు, జెఇఇ మెన్స్ పేర్లతో లక్షలు దండు కుంటున్నాయని అన్నారు. ఇలా వందల సంఖ్యలో విద్యార్థులను తమ కాలేజీల్లో జాయిన్ చేయించుకుంటూ ఎక్కడో ర్యాంకులు తెచ్చిన విద్యార్థులు పేపర్ స్టేట్‌మెంట్లు ఇస్తున్నారన్నారు. దీనిపైన ఏ అధికారి కూడా విచారణ చేయించడం లేదన్నారు. జాయిన్ అయిన ప్రతి విద్యార్థి కూడా ఎందుకు సీట్ రావడం లేదని చెప్పేసి విద్యార్థులు తల్లిదండ్రులు కూడా ప్రశ్నించే పరిస్థితిలో కనిపించడం లేదన్నారు. దీన్ని అదునుగా భావించిన యాజమాన్యాలు ప్రతి సంవత్సరం ఇలా వందల సంఖ్యలో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ కాలేజీల పైన ఒక కమిటీని వేసి విచారణ చేయించి ఇప్పటివరకు ఈ నీట్, జెఇఇ మెయిన్స్ విద్యార్థులకు సంబంధించి ఎవరైతే ఫీజులు కట్టి సీట్లు రాకుండా పోయాయో వాళ్ళందరూ కూడా తిరిగి డబ్బును అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీగా డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో విద్యార్థులను వారి తల్లిదండ్రులు కలుపుకొని పెద్ద ఎత్తున నిరసన తెలుపుతామని ప్రభుత్వాన్నిహెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి సాయి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పత్రికలలో వచ్చిన ప్రకటను చూపిస్తున్న నాయకులు

కూటమి ప్రభుత్వం ప్రజల పక్షమా.. కార్పొరేట్ పక్షమా..!

- స్పష్టం చేయాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజల పక్షమా! లేదా కార్పొరేటు అదాని పక్షమా! అనేది ప్రజలకు చెప్పాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని 24వ వార్డు లక్ష్మీ నగర్‌లో సిపిఎం వార్డు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు కరెంటు చార్జీలు తగ్గించాలంటూ ఇంటింటికి స్టిక్కర్లు వేసి ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమానికి వార్డు శాఖ కార్యదర్శి ఎ.లీలావతి నాయకత్వం వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.నరసింహులు నగర నాయకులు సి.శేషాద్రి, కాలనీ ప్రజలను చైతన్య పరుస్తూ మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు ప్రజల ఇళ్లకు పెడితే స్మార్ట్ మీటర్ భారం రూ.12 వేల పడుతుందన్నారు. జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు రూ.28 వేల కోట్ల ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో ప్రజల పైన భారం వేసిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వంఅధికారంలోకి రాక ముందు మేము అధికారం లో కొస్తే స్మార్ట్ మీటర్లను పెట్టబోమని, కరెంటు చార్జీలు పెంచబోమని తగ్గిస్తామని చెప్పారన్నారు. రైతులకు బిగించిన స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని చెప్పిన కూటమి ప్రభుత్వం నేతలు అధికారం లోకొచ్చాక మాట మార్చి వ్యాపార సముదాయం షాపులకు, ప్రభుత్వకార్యాలయాలకు, రైతులకు స్మార్ట్ మీటర్లు బిగించారన్నారు. తరువాత ప్రజల ఇళ్లకు కూడా బిగిస్తామంటున్నారన్నారు. ప్రజలందరూ స్మార్ట్ మీటరు స్టిక్కర్ వేసుకుని స్మార్ట్ మీటర్ వద్దు కరెంటు చార్జీలు తగ్గించాలనినిరసన తెలపాలని కోరారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం ప్రజల పక్షమా! లేదా కార్పొరేటు అదానిపక్షమా! అనేది ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సిపిఎం వార్డు నాయకులు, సిచందు, రాముడు, కర్రెన్న , జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

స్టిక్కర్లను కలిపిస్తున్న నాయకులు

విద్యార్థులకు తప్పనిసరిగా అడ్మిషన్ ఇవ్వాలి : డిఇఒ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఉచిత నిర్బంధ విద్యాహక్కుచట్టం కింద ఎంపికైన విద్యార్థులకు సంబంధిత పాఠశాలలో అడ్మిషన్ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ శామ్యూల్ పాల్ మంగళవారం ఓ ప్రకటనలో పాఠశాల యాజమాన్యాలను ఆదేశించారు. 25 శాతం అడ్మిషన్ల కింద ఎంపికయిన విద్యార్థులకు ప్రవేశాలు ఇవ్వడం లేదని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. విద్యార్థులందరికీ ప్రవేశాలు కల్పించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నదులలో కలుస్తున్న మురుగు నీరు

- కాలుష్య నగరంగా కర్నూలు

- నిలిచిపోయిన మురుగు నిటి శుద్ధి కేంద్రాలు

- మంజూరైన రూ.120 కోట్లు ఏమయ్యాయి...?

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరానికి ఒక వైపు తుంగభద్ర, మధ్యలో కేసి కెనాల్, హంద్రీ నది. నగరపాలక సంస్థ పరిధిలోని మురుగు నీరంతా ఈ నదుల్లో కలవడం వల్ల కర్నూలు కాలుష్య నగరంగా తయారైందని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు చిత్తారు వెంకటవర్మ, ఇరిగినేని పుల్లారెడ్డి, ఎస్.అహమ్మద్, ఇ.ఆంజనేయులుగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం స్థానికులతో కలిసి హంద్రీ, తుంగభద్రా నదుల ఒడ్డున నిలిచిపోయిన మురుగునీటి శుద్ధి కేంద్రాల ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మి చెట్టు సమీపంలో 2020లో హంద్రీ నది ఒడ్డున రూ.48 కోట్లతో, సుంకేసుల రోడ్డు లో తుంగభద్ర నది ఒడ్డున రూ. 75 కోట్లతో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ప్రారంభించారని తెలిపారు. ఈ రెండు కేంద్రాల నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ రెండు పూర్తయి ఉంటే ప్రతిరోజు 45 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేసే అవకాశం ఉండేదన్నారు. వీటి నిర్మాణం కోసం మంజూరైన రూ.120 కోట్ల నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. నగరం చుట్టూ ఉండే నదుల్లో మురుగు నీరు నిలిచి కాలుష్యం పెరిగి, దుర్వాసన, దోమలతో ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. అయినా పాలకులు, ప్రభుత్వ అధికారులు స్పందించడం లేదని విమర్శించారు. నగరం చుట్టూ నదుల్లో మురికి నీరు నిలిచి కాలుష్యం పెరిగిందని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రూ.ఐదు కోట్ల మేర జరిమానా విధించినట్లు ప్రచారం జరుగుతుందని అన్నారు. వెంటనే పాలకులు ఉన్నతాధికారులు స్పందించి నిలిచిపోయిన రెండు మురుగునీటి శుద్ధి కేంద్రాల పనులు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులను ఉన్నతాధికారులను కోరారు. ఈ పర్యటనలో ఎం.నాగరాజు, యూనూస్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రియాజ్, హబీబ్‌బాషా, చాంద్‌బాషా, షాకీర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న నాయకులు

స్మశానం దారి అధ్వానం...

ప్రజాశక్తి పత్తికొండ : స్మశానానికి వెళ్లే దారి అధ్వానంగా మారడంతో నరకయాతన పడుతున్నామని చక్రాల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ మండలం చక్రాల గ్రామంలోని డ్రెయినేజీ, సిసి రోడ్లు అస్తవ్యస్తంగా మారడంతో మురుకు నీరు అంతా స్మశానానికి వెళ్లే దారికి వెళ్లడంతో దారి చెరువును తలపిస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శవాన్ని పూర్చాలంటే బురద తొక్కాల్సిందేనని చెబుతున్నారు. గతంలో అనేకమంది బురదలో పడి కాళ్లు, చేతులు విరిగిన సంఘటనలు ఉన్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై పంచాయతీ సెక్రెటరీ పవన్‌ను వివరణ కోరగా సర్పంచి తో మాట్లాడి ప్రజలకు ఎలాంటి ఆటంకం లేకుండా నీటిని తొలగిస్తాం. సిసిరోడ్డు, డ్రెయినేజ్‌కు తీర్మానం చేసిన నివేదిక ప్రభుత్వానికి పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

బలవంతపు భూసేకరణ ఆపాలి

- డిటికె సిపిఎం వినతి

ప్రజాశక్తి-ఆలూరు


డిటికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం పవర్ గ్రిడ్ కోసం ఆలూరు మండలం మనేకుర్తి, మరకట్టు, కమ్మరచేడు, హులేబీడు, కాత్రికి రెవెన్యూ గ్రామాలలో చిన్న సన్నకారు రైతుల భూములను బలవంతంగా భూసేకరణ చేయడం సరికాదని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు,సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్ కు సిపిఎం బృందం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా భూమిని నమ్ముకుని గ్రామీణ ప్రాంతాల్లో జీవనం చేస్తున్న చిన్న సన్నకారు రైతుల భూములను పవర్ గ్రిడ్ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు భూములను స్వాధీనం చేయడం సరికాదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరణ చేస్తున్న భూములు చాలా సారవంతమైనవని మార్కెట్లో ఎకరాకు 20 లక్షల రూపాయలు ధర ఉందని ప్రభుత్వం రైతులకు మాత్రం నామమాత్రంగా 6 లక్షలు చెల్లిస్తామని చెప్పడని ఈ విధానం సరి కాదని వారు విమర్శించారు.రైతుల సాగుకు పనికిరాని భూములను గుర్తించి వాటిని సేకరించి పవర్ గ్రిడ్ కు ఉపయోగించుకోవాలని భూములను సేకరించడానికి ప్రయత్నిస్తే సిపిఎం పార్టీగా రైతుల మద్దతుగా పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు మైన, వెంకటేశ్వర్లు, కృష్ణ, ఈరన్న, విఠల్, లక్ష్మన్న, శేఖర్ రైతులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్ష మేరకే పాలన

బాబు ఏడాది పాలనపై ప్రజలలో సంతృప్తి-ప్రజాశక్తితో ఆలూరు టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి- ఆలూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నప్పటికీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తూ ముందుకు పోతున్నారు. ప్రజల ఆకాంక్ష మేరకే ప్రభుత్వ పాలన ఉండడంతో ఎంతో సంతృప్తిగా ఉన్నారు. రూ.మూడు వేల పింఛను రూ.నాలుగు వేలకు పెంచారు. దీపం పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నారు. త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నారు. ఆలూరు నియోజకవర్గంలో రూ.12కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాం. ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్ పలు విషయాలను వివరించారు.

ప్రభుత్వ ఏడాది పాలన పై ప్రజలు సంతృప్తిగా ఉన్నారా..?

వీరభద్ర: అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాలన కొనసాగుతుంది. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి విధ్వంసం పాలనకు ముగింపు పలికి ప్రస్తుత సిఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి వైపు ముందుకు వెళ్లడం సంతోషంగా ఉంది.

సూపర్ సిక్స్ పథకాలు పూర్తిగా అమలు చేయలేదని విమర్శలపై మీ అభిప్రాయం..?

వీరభద్ర: చంద్రబాబు ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి సంతకం చేసిన డిఎస్‌సి ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తున్నారు. మత్స్య కారులకు రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచారు. రూ.మూడు వేల పింఛను రూ.నాలుగు వేలకు పెంచారు. దీపం పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నారు. త్వరలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నారు.

నియోజకవర్గంలో ఏడాదిలో జరిగిన అభివృద్ధి పనులను వివరించండి..?

వీరభద్ర: మొదటి ఫేస్ కింద ప్రతి మండలానికి రూ.2కోట్లు చొప్పున ఆరు కోట్లతో రూ.12కోట్లు నిధులు మంజూరయ్యాయి. సిసి రోడ్లు, డ్రైనేజీ చేయడంతో పాటు పనులు పూర్తయ్యాయి. రెండో ఫేస్‌కింద ప్రతిమండలానికి రూ కోటి మంజూరయ్యాయి. పనులు పురోగతిలో ఉన్నాయి. స్వాతంత్ర్య కాలం నుంచి ఇబ్బందిగా ఉన్న హోళగుంద-వన్నూరుకు రూ.4.70 కోట్లతో బిటి రోడ్లు పనులు చేసాం. కడ్లిమాడికి రూ.2.20కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు, కురువ కొట్టాలకు రూ.70లక్షలతో బిటి రోడ్డు నిర్మాణం, కర్నూలుక్కై ప్రధాన రహదారి నుంచి అబ్లెకల్ గ్రామానికి రూ.30 లక్షలతో సిసి రోడ్డు పనులు జరిగాయి. నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్లకు రూ.2.30కోట్లతో మరమ్మతులు చేసాం. చింతకుంట నుంచి చాకిబండ వరకు రోడ్డు మరమ్మతులు చేసాం. ఆస్పరి మండలంలో దొడగొండ గ్రామానికి రూ.1.20కోట్లతో రోడ్డు పనులు పూర్తయ్యాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దేవరగట్టు ఆలయానికి రూ.3.25కోట్లతో త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తాం. దేవరగట్టు నుండి కొత్తపేట గ్రామానికి రూ.1కోటితో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమౌతాయి. నియోజకవర్గంలో రూ.6కోట్లతో గోకులం షెడ్లు పూర్తయ్యాయి. ఆగిపోయిన హోళగుంద-ఆదోని రోడ్డు నిర్మాణ పనులను రూ.14కోట్లతో త్వరలో ప్రారంభిస్తాం. ఆలూరు అంబేద్కర్ సర్కిల్ నుండి మార్కెట్ యార్డ్ వరకు రూ.2 కోట్లతో సిసి రోడ్డు, హోళగుంద బస్టాండ్ నుంచి వాల్మీకి విగ్రహం వరకు రూ.2కోట్లతో సిసి రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభమౌతాయి.

సాగునీటి పథకాల సాధనకు ఎలాంటి కృషి చేస్తున్నారు.

వీరభద్ర : 2019లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేదవతి నిర్మాణానికి ఆమోదం తెలిపారు. భూసేకరణ కూడ ప్రారంభమైంది. గత ప్రభుత్వం నిర్లక్షం వల్ల పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుత ప్రభుత్వం వేదవతి ప్రాజెక్టు, పెండింగులో ఉన్న నగరడోన రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేస్తాం.

గ్రామాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి ఎలాంటి ప్రణాళిక ఉంది..?

వీరభద్ర: నియోజకవర్గంలో వాటర్ గ్రిడ్ ద్వారా తాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. 40ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బాపురం రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తాం. ఆస్పరి మండలం జోహారాపురం గ్రామం వద్ద ఎస్-ఎస్ ట్యాంకు ఏర్పాటు చేసి హంద్రీనీవ నీటి ద్వారా మండలంలోని గ్రామాలకు తాగు నీటి సమస్య పరిష్కారానికి కషి చేస్తాం.

జింకల పార్కు ఏర్పాటుకు ఎలాంటి కృషి చేస్తారు..?

వీరభద్ర: జింకల పార్కు ఏర్పాటుకి అటవీశాఖ అనుమతులు పొందాల్సి ఉంటుంది. సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి జింకల పార్కు ఏర్పాటుకి కృషి చేస్తాం.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం..

ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి

ప్రజాశక్తి- గోనెగండ్ల

ఓహెచ్ఆర్ఎస్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు గోనెగండ్లలో తాగునీటి సమస్యను పరిష్కరించిన ఘనత టిడిపి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రమైన గోనెగండ్లలో నూతనంగా నిర్మించిన ఒహెచ్ఆర్ఎస్ ట్యాంకును ప్రారంభించారు. అనంతరం అలవాల ఎస్ఎస్ ట్యాంక్ నుంచి నిర్మిస్తున్న గ్రామంలోకి చేపట్టిన తాగునీటి సరఫరా పైపులైను పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సరైన సమయంలో పనులు చేపట్టకపోవడంతో గడువు ముగిసిపోయి తాగునీటి సమస్య పరిష్కారానికి అలవాల ఎస్ఎస్ ట్యాంక్ నుంచి గోనెగండ్లలో తాగునీటి సరఫరా పనులు రద్దు అయ్యాయని అన్నారు. గత ఎన్నికల సమయంలో గోనెగండ్ల ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తాము అధికారంలోకి రాగానే తమ కూటమి ప్రభుత్వ హయాంలో సిఎం, ఉప ముఖ్యమంత్రి, ఐటి మంత్రి దృష్టికి సమస్యలు తీసుకుని వెళ్లి గోనెగండ్ల మేజర్ పంచాయతీలో సుమారు రూ.2 కోట్ల 50 లక్షలలతో జలజీవన్ మిషన్ పనులను తిరిగి ప్రారంభించామన్నారు. గోనెగండ్లలో మూడు ఒహెచ్ఆర్ఎస్ ట్యాంకులకు గాను మొదటి విడతలో భాగంగా స్థానిక శివాలయం వద్ద 90 వేల లీటర్ల సామర్థ్యంతో కూడిన ట్యాంకు నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించి బిసి కాలనీలో శాశ్వతంగా సమస్యను పరిష్కరించడమన్నారు. మిగతా రెండు ట్యాంకుల నిర్మాణం , పైప్ లైన్ పనులను మూడు నెలల్లో పూర్తి చేసి ప్రతి ఇంటికి ఉచిత తాగునీటి వసతి కల్పిస్తామని అన్నారు. మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామంలో సైతం తాగునీటి సమస్య పరిష్కారానికి అలవాల ఎస్ఎస్ ట్యాంక్ నుంచి రూ.15 లక్షలతో నూతన పైపులైన్ పనులను ప్రారంభించామన్నారు. ఇప్పటికే సంవత్సరమే ముగిసిందని రానున్న రోజుల్లో అసలైన అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తామని అన్నారు. తహశీల్దార్ కుమారస్వామి, ఎంపిడిఒ మణిమంజరి, ఆర్డబ్ల్యూఎస్ డిఇ విద్యాసాగర్, హౌసింగ్ డిఇ ప్రసాద్, పిఆర్ ఎఇ శివశంకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం ఉద్యోగులు విధులకు డుమ్మా

10 గంటల 46 నిమిషాలకు హాజరైన పంచాయతీ కార్యదర్శి

ప్రజాశక్తి-మద్దికేర

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులు పనితీరు ఇష్టారాజ్యంగా మారింది. ఎప్పుడు విధులకు వస్తారో ఎప్పుడు తిరిగి వెళ్తారో ప్రజలకు తెలియని పరిస్థితి నెలకొంది. ప్రజలకు అందుబాటులో సేవలు అందాలని గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత అధికారుల పనితీరు వల్ల ఆశయం నీరుగారిపోతుంది. హంప సచివాలయంలో సోమవారం 10:30 గంటలైనా కూడా ఏ ఉద్యోగి హాజరు కాలేదు. 10:45 గంటలకు పంచాయతీ కార్యదర్శి వన్నూరప్ప ఇలా వచ్చి అలా వెళ్ళిపోయారు. ఎఎన్ఎం మాత్రం విధులకు హాజరై గ్రామంలో పనిచేసినట్లు తెలుస్తోంది. మిగతా ఉద్యోగులైన మహిళా పోలీసు, ఆర్టికల్చర్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, సర్వేయర్ తదితర శాఖ అధికారులు, ఏ ఒక్కరు విధులకు హాజరు కాలేదు. ప్రతిరోజు వీరి పనితీరు ఇలాగే ఉంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఏ పనికైనా గ్రామస్తులు వెళ్తే అధికారులు అందుబాటులో ఉండడం లేదన్నారు. మధ్యాహ్నం 3:30లకే తలుపులు వేసి వెళ్లిపోయారని ఆరోపించారు. ఈ విషయంపై ఎంపిడిఒ కొండయ్యను వివరణ కోరగా, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మాత్రం సెలవుపై వెళ్లారని మిగతావాళ్ళు అందుబాటులో ఉండాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, విధులకు గైర్హాజరైన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

తాళం వేసి ఉన్న సచివాలయం

ప్రజల సమిష్టి కృషితోనే మలేరియా అంతం

- జిల్లా మలేరియా అధికారి ఎ.నూకరాజు

ప్రజాశక్తి - మంత్రాలయం : ప్రజల సమిష్టి కషి తోనే మలేరియా అంతం అవుతుందని జిల్లా మలేరియా అధికారి ఎ.నూకరాజు తెలిపారు. మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేసి మలేరియా పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ చిన్నదైనా మలేరియా వ్యాధి పెద్దదని అందుకే చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలన్నారు. వర్షా కాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిలువకుండా చూసుకుని దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కలుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మండల వైద్యాధికారిణి డాక్టర్ గోవిందమ్మ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-వెల్దుర్తి: గుండెపోటుతో మహిళ మృతిచెందిన ఘటన మంగళవారం వెల్దుర్తిలో చోటుచేసుకుంది. బోగోలుకుచెందిన గొల్ల అయ్యమ్మ (56) భర్త అయ్యన్న, కూతురు వెంకటేశ్వరితో కలిసి బస్సులో కర్నూలుకు బయలుదేరారు. మార్గమధ్యలో బస్సు వెల్దుర్తి పాతబస్టాండుకు చేరుకోగానే హఠాత్తుగా అయ్యమ్మ చాతిలో నొప్పిగా ఉందని బస్సులో కుప్పకూలింది. ఆటోలో వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

మీరు వేసిన అక్రమ కనెక్షన్లు కనపడలేదా?

- వైసిపికి, టిడిపి నాయకుల సూటి ప్రశ్న

ప్రజాశక్తి-నందవరం : గత ఐదేళ్ల వైసిపి పాలనలో మీ నాయకులు ఎంతమందికి అక్రమ కనెక్షన్లు ఇచ్చారో మీకు కనపడడం లేదా అని టిడిపి క్లస్టర్ ఇన్ చార్జులు కాశీం వలి, ధర్మపురం గోపాల్ అన్నారు. మంగళవారం వారు నాగలదీన్నె ఎత్తిపోతల పథకం సందర్శించి, మాట్లాడుతూ కొన్ని పత్రికలలో అక్రమ కనెక్షన్లు వేసుకున్నారని రాయడం జరిగిందని, అయితే తమ పార్టీ నాయకులు ఎక్కడ అక్రమ కనెక్షన్లు ఇవ్వలేదని, కొంతమంది రైతులు స్వతహాగా పైపులను వేసుకున్నారన్నారు. నాగలదిన్నె ఎత్తిపోతల పథకానికి వేసిన కనెక్షన్లు పూర్తిగా తొలగించారని, అది తెలుసుకోకుండా వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే, టిడిపి నాయకులు పై అసత్య ఆరోపణ చేయడం సిగ్గుచేటని అన్నారు. మీ హయాంలో ఇష్టానుసారంగా వైసిపి నాయకులు 70 ఎకరాలకు అక్రమంగా కలెక్షన్లు ఇచ్చారని, వాటికి సంబంధించిన ప్రతి సమాచారం మా దగ్గర ఉందన్నారు. రైతుల పక్షాన నిలిచే మా ఎమ్మెల్యే ఎప్పుడూ రైతులకు అన్యాయం చేయరనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకుంటే మంచిదన్నారు. లేదంటే మీరు ఇచ్చిన అక్రమ కలెక్షన్లపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఈరన్న, బ్రహ్మానందరెడ్డి, సుధీర్, ఆదిశేషు, సత్యారెడ్డి, సామెల్, కిషోర్, జనసేన మండలాధ్యక్షుడు ఎల్లప్ప పాల్గొన్నారు.

నూతన సాంకేతిక పద్ధతులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో కెవికె బనవాసి వారు సైంటిస్టులు ఏర్పాటు చేసిన వికసిత్‌కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని సైంటిస్ట్ మౌనిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నూలు ఎడిఎ ఎన్.సాల్‌రెడ్డి , డిఆర్‌సి ఎడిఎ అన్నపూర్ణమ్మ , ఉద్యాన అధికారి మదన్మోహన్, మండల వ్యవసాయ అధికారి ఎన్.రవి ప్రకాష్ , గ్రామ రైతులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి చేపడుతున్న వివిధ రకాల రైతు సంబంధిత సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను రైతులకు పూర్తిగా తెలుసుకోవాలన్నారు. నూతన సాంకేతిక సాగు పద్ధతులను ఖరీఫ్ సీజన్ కు ప్రారంభంలోనే రైతులకు తెలియపరచి మంచి దిగుబడులు సాధించడానికి రైతులతో పాటు శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారులు బృందంగా ఏర్పడి మంచి దిగుబడులు సాధించడానికి , అధిక ఆదాయం పొందేలా ఉండాలన్నారు. మండలంలోని వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బందితో ఎడిఎ సాల్ రెడ్డి రివ్యూ చేశారు. రివ్యూలో కౌలు రైతు కార్డులు, సాయిల్ శాంపిల్స్ ,రైతులకు విత్తనం, అందుబాటులో ఉంచుట రసాయనికి ఎరువులు, అందుబాటులో ఉంచుట, అన్నదాత సుఖీభవ రైతుల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని సూచించారు. అనంతరం కోడుమూరు మండలంలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసుకొని చర్చించారు. విత్తనం ఎక్కడ కూడా కృత్రిమ కొరత సృష్టించరాదని రైతుకు ఎక్కువ రేటుకి అమ్మరాదని, బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. షాపులో ఉన్న స్టాక్ ను స్టాక్ బోర్డులో కచ్చితంగా కనపరిచి ఉంచాలన్నారు. నెలవారి రిపోర్టు మండల వ్యవసాయ అధికారికి ప్రతి డీలరు అందజేయాలన్నారు. కాలం చెల్లిన పురుగు మందులు గాని విత్తనాన్ని గాని ఎరువులను కానీ అమ్మినట్లు ఎక్కడైనా గుర్తించిన ఎడల వారి లైసెన్సులు రద్దు చేస్తూ క్రిమినల్ కేసులుపెడతామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న అధికారులు

పొలానికి హద్దులు చూపండి

ప్రజాశక్తి-ఆదోని

తమ పొలం కబ్జాకు గురైందని సర్వే చేయించి హద్దులు చూపేలా చర్యలు తీసుకోవాలని ఆదోని మండలం సంతే కుడ్లురు దళిత బాధితులు మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజకు వినతి పత్రం సమర్పించారు ఆదోని మండలం పరిధిలో సంతేకూడ్లురూ గ్రామాని చెందిన దళిత మారతమ్మ, రామదాస్ మాట్లాడుతూ సర్వే నెంబర్ 499లో ప్రభుత్వం 63 సెంట్లు భూమిని గత 22 సంవత్సరాలు ఇచ్చిందన్నారు. నాటి నుండి సాగు చేస్తూ ఉన్నామన్నారు. ఆ పొలం పైన ఉన్న తలారి 10 సెంట్ల భూమిని ఆక్రమించుకోవడం జరిగిందన్నారు. సర్వే చేయడానికి అధికారులు వస్తే తలారికి అనుకూలంగా సర్వే చేయడం జరిగిందన్నారు. తమకు న్యాయం చేయాలని వేసుకున్న పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 63 సెంట్లు భూమికి హద్దులు చూపించలన్నారు. ఆక్రమించుకున్న తలారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు

ప్రజాశక్తి - హాలహర్వి

పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు అని, చెట్ల పెంపకంతో గ్రామాలు, పట్టణాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంటుందని అధి కారులు, ప్రజాప్రతినిధులు అన్నారు. మంగళవారం నిర్వహించిన చెట్లనాటి భవిష్యత్తును కాపాడుకుందాం అనే నినాదంతో బాపూరం, గ్రామస్తులు చెట్లు నాటారు. గ్రామస్తులు మాట్లాడుతూ మానవ మనుగడకు ప్రాణం పోసేది మొక్కలేనని, మొక్కలను నాటడం కూడా అభివద్ధిలో భాగమని చెప్పారు. రోజు రోజుకూ పెరుగుతున్న కాలుష్య నియంత్రణకు, పర్యావరణ సమతుల్యానికి మొక్కలను తప్పకుండా పెంచాలని కోరారు. లేదంటే రాబోవు కాలంలో ఆక్సిజన్ దొరకక సిలిండర్లు పెట్టుకునే స్థాయి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టకునే ఈ క్రమంలో యువత కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు దేవాలయాలు ఇళ్ల దగ్గర మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని చేపట్టినందుకు యువతకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దకే సబ్సిడీ బియ్యం

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు :

వికలాంగులకు , వృద్ధులకు ఇంటి వద్దకే సబ్సిడీ బియ్యం అందించాలని కూటమి ప్రభుత్వం మంచి సంకల్పంలో భాగంగా మంగళవారం నడవలేని నిస్సహాయకులు ఓబులమ్మ అవ్వకు, ఎంకప్పతాతకు, ఎమ్మెస్ నగర్ షేక్షావలి తాతకు ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు బియ్యం, చెక్కర డీలర్ మహబూబ్‌బాషా పంపిణీ చేశారు. నడవలేని నిస్సహాయకులు అవ్వతాతలు ముఖ్యమంత్రికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మతాల సమస్యగా మారిన శ్మశాన స్థల వివాదం

- **చెట్నహళ్లిలో కొంత కాలంగా ఉద్రిక్త వాతావరణం**
- **పోలీసు నిఘాలో గ్రామం**
- **రెవెన్యూ అధికారుల జాప్యం వల్లేకొనసాగుతున్న వైరం**

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలం చెట్నహల్లి గ్రామ సమీపంలో సర్వే నెంబరులో 113లో 1.5 ఎకరాలు రస్తా పోరంబోకు భూమిలో కొన్నేళ్లుగా స్మశాన వాటికగా గ్రామస్తులు ఉపయోగించుకుంటున్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో దళితులకు స్మశాన వాటిక స్థలంలో రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడంతో లబ్ధిదారులు జగనన్న ఇళ్లు నిర్మించుకున్నారు. ఇక్కడ నుండే అసలు కథ మొదలైంది. మూడు నెలలుగా గ్రామంలో ఎవరు చని పోయినా శ్మశానంలో మత దేహాలను పూడ్చరాదని, పూడ్చడం వల్ల మాకు అనారోగ్య సమస్యలు వస్తాయని ఎస్సీ కుటుంబాల వారు వ్యతిరేకించారు. వారి వ్యతిరేకత వల్ల గ్రామంలో 9 కులాల వారు ఏకమై తహసీల్దార్‌కు మొర పెట్టుకున్నారు. ఈ విషయంపై జైభీమ్ ఎంఆర్పిఎస్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను కలిసి శ్మశాన వాటిక కోసం తుంగభద్ర సమీపంలో ప్రభుత్వం భూమి మంజూరు చేసిందని అక్కడే ఖననం చేసుకోవాలని పట్టు బడ్డారు. బిసి సామాజిక వర్గం మాత్రం ససేమిరా అంటూ చనిపోయిన వారిని పూర్వం నుంచి ఇక్కడే మట్టి చేస్తున్నారని, ఇక్కడే చేస్తామని పట్టు బడ్డారు. అప్పటి నుండి గ్రామంలో ఎవరు మృతి చెందినా శ్మశాన వాటిక రణభూమిగా మారుతోంది. రెండు సామాజిక వర్గాల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఎస్సీల ఫిర్యాదు తో తహసీల్దార్ ఆదేశాలతో గ్రామంలో ప్రశాంతతకు భంగం కలగకుండా బిసిలైన 50 మంది పైన, ఎస్సీల బైండోవర్ కేసులు పెట్టి పోలీసులు కళ్ళెం వేశారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాష, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు, సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. మొదటి నుంచి ఎస్సీలకు జైభీమ్ ఎంఆర్పిఎస్ మద్దతు ఇవ్వగా కొత్తగా బిసి లకు విశ్వ హిందూ పరిషత్ వారు మద్దతు ఇచ్చారు. ఇరు సంఘాల వారు అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో సొంత అన్నదమ్ములుగా ఉన్న బిసి, ఎస్సీలు భద్ర శత్రువులుగా మారారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని గ్రామస్తులు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశాల మేరకు ఇరు సామాజిక వర్గాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్ రవి తెలిపారు.

చెట్నిహల్లిలో పోలీసుల బలగాల మొహరింపు

చెట్నిహల్లిలో పోలీస్ బందోబస్తు

మండల పరిధిలోని చెట్నిహల్లి గ్రామంలో శ్మశాన వాటిక విషయంలో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా సిఐ రామాంజులు ఆధ్వర్యంలో పోలీసు బలగాలు మొహరించారు. తుంగభద్ర నది ఒడ్డున శ్మశానానికి స్థల సేకరణ చేసి రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టిన నేపథ్యంలో మహిళలు ఒక్క సారిగా అధికారులను అడ్డుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచి అంజని, టిడిపి నాయకులు నాగేష్ ఇంటికి వెళ్లి తీర్మానం ఎలా చేశారని నిలదీశారు. విషయం తెలుసుకున్న సిఐ రామాం జులు ఎమ్మిగనూరు కోసిగి నందవరం ఎస్ఐ కేశవమాధవరం పెద్దకడబూర్ మండలాల నుంచి పోలీసు బలగాలను దింపి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బందోబస్తు బస్తులో మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్, ఎమ్మిగనూరు ఎస్ఐ శ్రీనివాసులు, కోసిగి ఎస్ఐ హనుమంత రెడ్డి, పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్ రెడ్డి, నందవరం ఎస్ఐ కేశవ ఇతర పోలీసు సిబ్బంది మహిళా పోలీసులు ఉన్నారు.

ఏడాదిలో కూటమి ప్రభుత్వ సుపరిపాలన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పాలకవీటి విజయకుమార్

రాష్ట్రంలో ఏడాది పాలనలో టిడిపి సుపరిపాలనను అందించిందని ఎపి నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉమ్మడి జిల్లాల డైరెక్టర్ పాలకవీటి విజయ్‌కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఆంధ్ర రాష్ట్ర ప్రజలు గుండెల మీద చేయి వేసుకొని ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. పరిపాలన విధానం, ధర్మం తెలిసిన వ్యక్తి సిఎం చంద్రబాబు నాయుడని అన్నారు. రాజకీయమంటే అధికారం చలాయించడం కాదని, అధికారం ఇచ్చిన ప్రజలను, దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించడమే నిజమైన రాజకీయమని చంద్రబాబు నమ్మారన్నారు. అదేదారిలో ఐటి శాఖ మంత్రి లోకేష్ ఉన్నాడన్నారు. ఈ సుపరిపాలన సందర్భంగా రాష్ట్ర ప్రజలు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటినీ, పార్టీ ఆఫీసును రంగవల్లులతో మన ముంగిల్లను అలంకరించి సాయంకాలం దీపాలను వెలిగించి పండుగ వేడుక చేసుకుందామని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడుకి, ఐటి శాఖ మంత్రి లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు నాసిరకం వేరు శనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-ఆస్పరి



ప్రభుత్వం రాయితీతో రైతులకు అందిస్తున్న వేరుశనగ విత్తనాలు నాసిరకంగా ఉన్నాయని ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ మండిపడ్డారు. మంగళవారం మండలం పరిధిలోని కైరుప్పల గ్రామంలోని రైతు భరోసా కేంద్రానికి వచ్చిన వేరుశనగ విత్తనాలులోడు వచ్చింది. రైతులకు పంపిణీ చేస్తున్న విత్తనాల సంచి విప్పి చూస్తే తాలు, రాళ్లు ఉన్నాయని తెలిపారు. నాణ్యతగా ఉన్న విత్తనాలు అందిం చాల్సిన ప్రభుత్వం నాణ్యత లోపించిన నాసిరకం విత్తనాలు అందిస్తుందని విమర్శించారు. ప్రతి సంచిలో తాలు, రాళ్ళు, చెడిపోయిన విత్తనాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. 30 కిలోల బస్తలో 2,3 కిలోల వరకు తరుగు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వేరుశనగ విత్తనాలు సాగు చేయ డానికి కూడా రైతులకు పనికి రావ న్నారు. అధికారులు పరీక్షలు చేసిన తరువాత నాణ్యతమైనవి అని నిర్ధా రణ అయిన అనంతరం రైతులకు పంపిణీ చేయాలన్నారు. లేని పక్షంలో రైతులతో కలిసి వ్యవసాయ శాఖఆఫీసు ఎదుట బైఠాయించి రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు.

శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ సభ్యులగా గిరిజావాణిని నియమించాలి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులగా ఆదోని పట్టణానికి చెందిన గిరిజావాణిని నియమించాలని, ఆదోని డివిజన్ జంగమ అర్చక సమైక్య అధ్యక్ష కార్యదర్శులు వీరభద్రయ్య, మదిరె వీరేష్ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ సిద్దయ్యస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా సేవలు అందిస్తున్నారని, అల్కురి మఠం మహర్షి గిరిజావాణి ఉన్నత చదువులు చదివి, ప్రైవేట్ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ అల్కురి మఠం మహర్షి కుటుంబ సభ్యులు గత కొన్నేళ్లుగా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. 14 సంవత్సరాలుగా శ్రీశైలం వెళ్లే పాదయాత్ర భక్తులకు మహాశివరాత్రి, ఉగాదికి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం, శ్రీమహాయోగి లక్ష్మమ్మ జాతర సందర్భంగా ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం, పేద విద్యార్థులకు చదువుకు ఆర్థిక సాయం అందించడం, రైతులకు వర్షాల కోసం ప్రత్యేక పూజలు తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, అలాంటి వారిని కూటమి ప్రభుత్వం జంగమ అర్చక సమైక్య సంఘం ద్వారా ఆమెను గుర్తించాలని కోరారు. ఆదోని డివిజన్ జంగమ అర్చక సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

-మేనేజర్ ఎస్‌కె శ్రీనివాసరావు

ప్రజాశక్తి-మంత్రాలయం



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో జరుగుతున్న అన్నదానానికి భక్తుల నుంచి రూ. 2 లక్షల విరాళం వచ్చినట్లు శ్రీ మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై బెంగళూరుకు చెందిన రవిరంగా అనే భక్తులు దర్శన అనంతరం రోజూ వారి సంపూర్ణ అన్నదాన సేవ కోసం రూ.రెండు లక్షలు విరాళంగా ఇచ్చారని వారికి పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారని తెలిపారు.

ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలి

- డిఎల్‌పిఓ వీరభద్రప్ప

ప్రజాశక్తి-చిప్పగిరి: ప్రతి పంచాయతీని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దాలని పంచాయతీ కార్యదర్శులకు డిఎల్‌పిఓ వీరభద్రప్ప సూచించారు. మంగళవారం చిప్పగిరిలో డిప్యూటీ ఎంపీడీవో బాలన్న ఆధ్వర్యంలో సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. డిఎల్‌పిఓ మాట్లాడుతూ పంచాయతీలలో పెండింగ్లో ఉండిపోయిన ఇంటి, నీటి గుత్తలు ప్రజలకు తెలిపి వసూలు చేసుకోవాలన్నారు. వర్షాలు ఎక్కువ వస్తున్నందున గ్రామాలలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బందితో సమన్వయ చేసుకుని గ్రామాలలో ఏ సమస్య వచ్చిన పరిష్కరించాలన్నారు. అనంతరం చిప్పగిరిలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు.